క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలపై అవగాహన

రేపల్లె రూరల్: వికాసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో మండలంలోని మోర్లవారిపాలెం, కారుమూరు గ్రామ సచివాలయం ఆవరణలో సభ శనివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీటీసీ అలివేలు మంగమ్మ, పంచాయతీ కార్యదర్శులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌడ కార్తిక వన సమారాధన



రేపల్లె రూరల్: పట్టణంలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఆలయంలో ఉసిరి చెట్టుకు, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. తొలుత రింగురోడ్డు సెంటరులోని మాజీ మంత్రి అనగాని భగవంతరావు విగ్రహానికి, గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కార్తిక మాసం ప్రత్యేక పూజలు



బాపట్ల అర్బన్: స్థానిక ఎస్ఎన్పీ అగ్రహారం గంగాపర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం శనివారం ప్రాతఃకాల అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొల్లిపర వెంకట శివ వరప్రసాద్ స్వామివారిని 'శ్రీ విరూపాక్షుని'గా భక్తులకు దర్శనం గావించారు. అర్చకులు గూడూరు చిట్టి బాబు, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ పాల్గొన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు.

మోటర్లతో నీటి తరలింపు



భట్టిప్రోలు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌కు స్థానిక ఎంవీజీఆర్ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో గండి పడటంతో నీరు పంట పొలాలను చుట్టుముట్టింది. ఈ నేపథ్యంలో శనివారం రైతులందరూ పంటలను కాపాడుకునేందుకు నాలుగు మోటార్లను ఏర్పాటు చేసి, నీటిని బయటకు పంపుతున్నారు.

పెదపులివర్రులో సహస్ర దీపోత్సవం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి స్వామికి 27వ రోజు శనివారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ద్వాదశ హారతులు నిత్యం కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్‌కుమార్ శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, ఈఓ మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

కూరగాయలు పంపిణీ

బాపట్ల అర్బన్: పట్టణంలోని 7వ వార్డు వెన్నెగంటి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సందర్శించారు. పేటేరు, భట్టిప్రోలు, బాపట్ల, పర్చూరు తదితర ప్రాంతాల రైతులను పరామర్శించారు. బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీ జేడీ శీలం వర్షం నీటిని బయటకు పంపేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంట అంజిబాబు, పీసీసీ జనరల్ సెక్రటరీ ప్రకాష్, తోట శివ నాగేశ్వరరావు, దోనిపూడి, పఠాన్ రాజేష్, చింతా బాబురావు, ఎస్వీఆర్ కుమార్ దోనేపూడి రవి పాల్గొన్నారు.

నష్టపరిహారంపై మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదు

- ఎన్టీఆర్‌ని మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన చంద్రబాబు
- ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: తుపాను నష్టపరిహారంపై మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు లేదని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. తుపాను నష్ట పరిహారం కనీసం రూ.2,500 కూడా ఇవ్వటం చేతకానీ చంద్రబాబునాయుడు ఇప్పుడు ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం బాధాకరమన్నారు. శనివారం స్థానిక కోన చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వచ్చిన తుపానుల నేపథ్యంలో కనీసం సాయం అందించటంలో విమర్శలకు గురైన చంద్రబాబునాయుడు అర్థం లేని డిమాండ్లతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. అమ్మఒడి పథకం ఎందుకు అని ప్రశ్నించిన ఆయన.. ఇప్పుడు ఇంటికి ముగ్గురికైనా.. అమ్మ ఒడి నగదు ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. రైతు పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల బీమా సొమ్ము చెల్లించి, ఈ–క్రాప్ బుక్ చేయటం, రైతు భరోసాతో వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సంక్రాంతి పండగలోపే ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చే విధంగా నిర్ణయం తీసుకోవటం హర్షణీయమన్నారు.

నల్లమడ డ్రెయినేజీ ఆధునీకీకరణ వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్ ముంపునకు గురైనప్పుడు అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పర్యటనకు వచ్చి రూ.550కోట్లతో ఆధునీకీకరణ చేస్తామని హామీ ఇచ్చారని కోన గుర్తుచేశారు. కనీసం కోటి రూపాయలు కూడా నిధులు విడుదల చేయకుండా రూ.30లక్షలతో తూతూ మంత్రంగా పనులు చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నల్లమడ డ్రెయినేజీ ఆధునీకీకరణ చేసేందుకు ప్రతిపాదనలు పంపామని, కరోనా విపత్తు రావటంతో ప్రాధాన్యతలు మారిపోయినట్లు కోన చెప్పారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావటం తథ్యమని, నల్లమడలోని ఏడు చోట్ల ఉన్న వంపులను సరిచేయటం, పూడికతీత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. భర్తీపూడిలో ఎన్టీఆర్ విగ్రహం విరగొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని సూచించటం జరిగిందని కోన చెప్పారు. ఎన్టీఆర్ అంటే అందరికి ప్రేమాభిమానాలు ఉన్నాయన్నారు. ఎన్టీఆర్‌ని మానసిక క్షోభకు గురి చేసి ఆయన చనిపోయేందుకు కారణమైన చంద్రబాబునాయుడు ఎన్టీఆర్‌పై ఎక్కడలేని ప్రేమను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, జోగి రాజా, గొర్రెముచ్చు వెంకటేశ్వర్లు, ముదుగు అక్కిరెడ్డి పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

న్యాయమూర్తి కె.పి.బాలాజీ



లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి బాలాజీ

బాపట్ల: రాజీమార్గమే రాజమార్గమని న్యాయమూర్తి కె.పి.బాలాజీ పేర్కొన్నారు. శనివారం బాపట్ల కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఇందులో 174 కేసులు పరిష్కరించారు. వివాదాలను పరిష్కరించుకోవటమే ఉత్తమం అని న్యాయమూర్తి కేపీ బాలాజీ అన్నారు. న్యాయమూర్తులు ఎం.పవన్ కుమార్, జి.రుక్మిణి, జి.వాణి, మహేంద్రనాథ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిల్లా కమల్ కుమార్, బార్ అసోసియేషన్ నాయకులు బి.లీలాకృష్ణ, వై.ఉషారాణి, సొలురాజు, బండి రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

భారతదేశ సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం



ఎంపీ మోపిదేవిని సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

రేపల్లె: భారతదేశ సాంప్రదాయాలకు ప్రపంచంలో ప్రత్యేకత ఉందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో శనివారం నిర్వహించిన కాపు వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వన సమారాధనలు ప్రజల్లో ఐకమత్యం తీసుకువచ్చేందుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్‌తరాలకు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ మోపిదేవిని పలువురు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, మార్కెట్ యార్డు చైర్మన్ దేవగిరి సాంబశివరావు, నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, కాపు నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం



తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

మోదుకూరు(వేమూరు): మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి, పంట నష్టం అంచనా వేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అధికారులను ఆదేశించారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో నీట మునిగిన వరి పనలను ఆయన పరిశీలించారు. పంట నష్టం అంచనాలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు.. మంత్రి పంట పొలాలు పరిశీలించలేదని ప్రకటనలివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనకు, టీడీపీ నాయకులకు కళ్లు కనపడటం లేదని, నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రెండుసార్లు తాను పంట పొలాలు పరిశీలించడం జరిగిందని చెప్పారు. పంట నష్టపోయిన రైతులతో, అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సీఎం వైఎస్‌జగన్ నిత్యం రైతుల సంక్షేమానికి పనిచేశారని, టీడీపీ నాయకులు రైతుల కోసం పని చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. పంట నష్ట పోయిన రైతులకు నెల రోజుల్లో నష్టపరిహారం అందించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. చంద్రబాబు నాయుడికి తప్పుడు ప్రచారం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి మండిపడ్డారు. పార్టీ నాయకులు అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అళ్ల వెంకటరమణారెడ్డి, అన్నపరెడ్డి వీరారెడ్డి, సుబ్బారెడ్డి, ఆళ్ల శ్రీధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా సెంటర్ ఫర్ క్రియేటివ్ ఆర్ట్స్ ప్రారంభోత్సవం



బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో సెంటర్ ఫర్ క్రియేటివ్ ఆర్ట్స్ 14వ వార్షిక ప్రారంభ వేడుకలను శనివారం ఘనంగా జరిగాయి. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వివిధ కళల్లో నైపుణ్యం పెంపొందించేందుకు సీసీఏ ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్, డీన్, స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగభద్ర వంతెనకు తాత్కాలిక మరమ్మతులు



చుండూరు(వేమూరు): తుంగభద్ర వంతెనపై ఏర్పడిన రెండు రంధ్రాలకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని ఆర్అండ్‌బీ ఈఈ వి.శ్రీనివాసరరావు తెలిపారు. చుండూరు మండల కేంద్రంలోని తుంగభద్ర వంతెనపై రంధ్రాలు పడటంతో.. రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వంతెనపై చుండూరు నుంచి గుంటూరు, పోన్నూరు రాకపోకలు జరుగుతున్నాయి. వరద నీరు వంతెన కిందగా తీవ్రంగా వెళ్తుండటంతో.. వరద తగ్గిన వెంటనే మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. డీఈ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణా పాల్గొన్నారు.

వీనులవిందుగా సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డు అన్నదాన సమాజం వేదికగా నవ కళోదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. పలు చిత్రాల్లోని పాటల్ని గాయకులు టి. సుధీర్, ఘన శ్యామాచారి, వై. సుబ్బారావు, బాబూరావు, పత్రి గాయత్రీదేవి, చింతా రజని ఆలపించారు. వీరికి కీబోర్డుపై రవి, తబలాపై వెంకట్, ప్యాడ్స్‌పై సురేష్ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ అధ్యక్షుడు పి.యల్.యన్.మూర్తి కళాకారుల్ని సత్కరించారు.

రైతులను ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న జేడీ శీలం

భట్టిప్రోలు: మిచాంగ్ తుపాన్ రైతులకు అపార నష్టం కల్గించిందని, పంట పొలాల్లోని నీరు బయటకు పోవాలంటే రోజులు పడుతోందని రాజ్యసభ మాజీ సభ్యుడు జేడీ శీలం అన్నారు. శనివారం భట్టిప్రోలు–చావలి రహదారిలో నీట మునిగిన వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులకు పంట నష్ట పరిహారం ఎంత ఇచ్చినా సరిపోదన్నారు. బ్యాంక్ రుణాలు రద్దు చేసి, పంటల బీమా పూర్తిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా మహిళా రైతు కూలీలకు వివిధ రకాల కూరగాయలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఘంటా అంజిబాబు, ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడికొండ వెంకటేశ్వరరావు, భట్టిప్రోలు, అమృతలూరు, కొల్లూరు మండలాల కన్వీనర్లు నిజాంపట్నం ఏడుకొండలు, పి. ప్రభాకరరావు, నగేష్, పట్టణ అధ్యక్షులు గౌస్ బేగ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేగంగా షాదీఖానా అభివృద్ధి పనులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు–1, 2 సచివాలయాలకు కేటాయించిన రూ.40 లక్షల నిధులతో భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. అద్దేపల్లిలో ముస్లింల షాదీ ఖానాకు కేటాయించిన రూ. 10 లక్షలతో శనివారం పనులకు శ్రీకారం చుట్టారు. కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, మత పెద్దలు షేక్ జిలాని, అల్లాభక్షు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ షాదీఖానా నిర్మాణం పూర్తి చేసి జనవరిలో మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున చేతుల మీదగా ప్రారంభించడం జరుగుతుందని వారు తెలిపారు. ముస్లింలకు రూ. 10 లక్షలు కేటాయించిన మంత్రి నాగార్జునకు మత పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపార్చన



దీపారాధనలో కోన రమాదేవి

బాపట్ల అర్బన్ : బాపట్ల పాత బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక మాసం సహస్ర దీపార్చన శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి కోన రమాదేవి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల విఖనసమూర్తి, మేడూరి వెంకట అప్పలాచార్యులు, శేషాచార్యులు, వంశీ, ఆలయ కమిటీ సభ్యులు జిడుగు సోమయ్య, వక్కలగడ్డ వెంకట శ్రీనివాసరావు, కొలనుమోహన్ శ్రీనివాస్, నెమలికంటి హనుమంతరావు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేటి నుంచి పుస్తక మహోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వల్లూరి శివ ప్రసాద్, మల్లికార్జునరావు

పాత గుంటూరు: విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లోని ఏఈఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల10వ తేదీ నుంచి 31 వరకు 23వ పుస్తక మహోత్సవం (పుస్తక ప్రదర్శన) ఏర్పాటు చేసినట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, బుక్ హౌస్ మేనేజర్ మురకొండ మల్లికార్జునరావు తెలిపారు. బుక్ హౌస్‌లో శనివారం విలేకరుల సమావేశంలో శివ ప్రసాద్ మాట్లాడుతూ 10న సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆర్.కె. నారాయణ్, కుష్వంత్ సింగ్, మహాత్మాగాంధీ, నెహ్రూ రచనలతో పాటు గురజాడ, శ్రీశ్రీ వంటి ప్రఖ్యాత రచయితల రచనలు, ఆధ్యాత్మిక, వాస్తు శాస్త్ర గ్రంథాలయాలతో పాటు, వైద్య, ఆరోగ్య, పాపులర్ సైన్స్ గ్రంథాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థుల కోసం అన్ని రకాల కాంపిటేటివ్, గ్రామర్, రిఫరెన్స్ బుక్స్, తెలుగు అకాడమీ టెక్స్ట్ బుక్స్,100 రకాల డిక్షనరీలు కూడా ఉంటాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ప్రదర్శనను పుస్తక ప్రియులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. అరసం ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ఆవిష్కరణలు, పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు జరుగుతాయని వారు వెల్లడించారు.

అవినీతి అంతంతోనే దేశ ఆర్థికాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం

లక్ష్మీపురం: ప్రపంచ మంతటా వివిధ రూపాల్లో తాండవిస్తున్న అవినీతి ఆర్థికాభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని దెబ్బతీస్తోందని సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం పేర్కొన్నారు. అవినీతి అంతంతోనే దేశ ఆర్థికాభివృద్ధి ఆయన తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అవినీతి , అక్రమాలను నిర్మూలించాలంటే పటిష్టమైన విధానాలను చేపట్టాలని కోరారు. వాటి అమలుకు సమర్థమైన సంస్థల్ని ఏర్పరచాలని అభిప్రాయపడ్డారు. రాజకీయ పార్టీలకు విరాళాలు, ఎన్నికల వ్యయం విషయంలో పారదర్శకత ఉండేలా చూడాలని కోరారు. ప్రభుత్వాధికారులు విధి నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాధన వ్యయంలో పారదర్శకత, జవాబుదారీతనాలకు పెద్దపీట వేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ సభ్యులు అవధానుల హరి, గుప్తా, భాస్కరావు పాల్గొన్నారు.

మానవ మనుగడకు హక్కులు ఎంతో కీలకం



గృహ కార్మిక మహిళలతో కట్టా కాళిదాస్, సిస్టర్ వ్యాకుల మేరీ

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ మనుగడకు రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎంతో కీలకమని జిల్లా కోర్టు పూర్వపు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాస్ పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో శనివారం ఎంఎస్ఐ, అంధేరీ హిల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా గృహ కార్మికులతో ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాళిదాస్ మాట్లాడుతూ మానవ హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు సమాజంపై ఉందని తెలిపారు. భూమిపై పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రంగా జీవించేందుకు కొన్ని హక్కులు ఉంటాయన్నారు. జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ తదితర కారణాలతో వివక్ష లేని జీవనం గడపాలని సూచించారు. ప్రైవేటు సంస్థలు, గృహాల్లో పని చేయించుకునే కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉందని, హక్కులకు భంగం వాటిల్లినప్పుడు కోర్టుల ద్వారా న్యాయం పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించే హక్కును పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపాల్ సిస్టర్ ఐడా, కో–ఆర్డినేటర్లు జి. అనురాధ, సిస్టర్ వ్యాకుల మేరీ, 150 మంది గృహ కార్మికులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో ఇరుపక్షాలకు మేలు



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదికని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని న్యాయమూర్తులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కేపీ బాలాజీ, ఎం. శ్రీధర్, పి. రాజశేఖర్, జె. శ్రీసత మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 34 సీసీలు, 180 క్రిమినల్, ఐదు రోడ్డు ప్రమాద కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ. 1,31, 73, 864 పరిహారం కింద అందించారు. అదాలత్ సభ్యులు కేపీఎల్ ప్రభావతి, పి.రమేష్, కె. చంద్రశేఖర్, ఖాదర్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. వేణుగోపాలరావు, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనారాయణపురానికి చెందిన జొన్నాడ రాము కుమారుడు అంజి (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చదువులో వెనుకబడడంతో మానసికంగా కుంగిపోయి శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 6/3లో వెబ్‌ల్యాబ్ టెక్నాలజీస్ కన్సల్టెన్సీని సునీల్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. రాజేష్‌కుమార్ ఉద్యోగం కోసం అతడ్ని కలిశాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రాజేష్‌కుమార్ వద్ద రూ. 3 లక్షలు తీసుకుని ఇప్పించలేదు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17న విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు

నెహ్రూనగర్: ఏపీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఇంటర్ స్కూల్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు లోకేష్ పేర్కొన్నారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో పోటీల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 15 లోపు పేర్లను 91107 16045, 98482 10265 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నేడు సినీ కళాకారులకు పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, మహాదాత ఆళ్ల దశరథరామిరెడ్డి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభలో ప్రముఖ సినీ నటి సుధకు మహానటి సావిత్రి పురస్కారం, గాయకులు చంద్రతేజ, కె. ప్రవీణ్ కుమార్, కాట్రగడ్డ శ్రీనివాసుడు, సత్యానంద్, జయశ్రీ ప్రఖ్య, శైలజ, మాధవి, ఇందునైనలకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు తెలిపారు.